మోడ్రన్ ఎద్యుకేటెడ్ గరల్స్ రేడియో తిప్పుకుంటున్నారు. అసలు ఆడాళ్ళు పాడుకోవటం మానేశాకే పాడయ్యారు. పాటలకు మన జీవితంతో వుండే సంబంధాన్ని తెంచివేసుకున్నాము. రొటీన్ జీవితంలోంచి సంగీతం నిష్క్రమించింది. మా చిన్నప్పుడు ఆడ పిల్లలం అందరం ఒకచోట కూర్చుని పాటలు పాడుకునేవాళ్ళం. కొత్త పాటలు నేర్చుకునే వాళ్ళం. ఎవళ్ళింట్లో అయినా పేరంటమైతే పెంకు లెగిరిపోయేలా పాటలు పాడి వాయినాలిచ్చుకుని మెళ్ళో గంధం నుదుటను బొట్టుమీద బొట్టు బారెడు బారెడు జడల్ను (జడ పదార్థాలంకదా మేము) వూపుకుంటూ రోడ్డంతా కలకల్లాడి పోయేట్లు నడిచి వచ్చేవాళ్ళం. ఆ సరదాలు ఆ సంగీతమూ జీవితంలోంచి ఎటో చెప్పకుండా వెళ్లిపోయాయి. రేడియో, సినిమా, యివి రెండే మన బ్రతుకుల్ని ఏలుతున్నాయి. మన నోళ్లు మూతపడ్డాక, మనం పాడుకోలేక పోయాక, ఎవరెంత గొప్పగా పాడితే మట్టుకు మనకదేం గొప్ప? ఇప్పుడు "డియ్యోడియ్యో" "కుయ్యో-కుయ్యో" అంటూ మొత్తం సినిమా నిండా ఉద్రేకప్పాటలే పెడుతున్నారు కదా! ఆ పాటలు యింట్లో ఆడపిల్లలు పాడుకోవటానికి ఏం బాగుంటాయి? చివరకు సినిమావాళ్లు కూడా తెలుగు జీవితంలో నుంచి తెలుగును తగ్గించి తప్పించేస్తున్నారు. "దోచుకో" "దాచుకో" పాటలు "మగసిరి-గడసరి-సొగసరి-సరిసరి-సిరి-సిరి" అంటూ అవే మాటల్ని పిల్లి మంత్రించి రాసి అమ్ముకోడానికి కవులకు సిగ్గు వేయటంలేదా? సంగీతాన్ని, సాహిత్యాన్ని, అన్ని లలిత కళల్నీ చెడగొట్టడానికి సినిమా కంకణం కట్టుకుంది. తెలుగు సినిమాలు తెలుగు వాళ్ళ నిష్ఠ దరిద్రానికి నిత్యోపమానాలు.

దొరలన్నీ పద్ధతి ప్రకారం చేస్తారుట. వాళ్ళకు "నిద్ర మేనర్స్" అని వున్నాయి. నిద్రపోయే ముందు గుడ్‌నైట్ చెప్పి "ముద్దెట్టు" కుంటారు. మళ్ళీ తెల్లారి లేస్తూనే 'హవ్ డూయుడూ' - "రాత్రి బాగా నిద్ర పట్టిందా" అని అడుగుతారు. ఒహప్పుడీ నిద్ర మేనర్స్ మరీ అడుగు దాటరాని ఆచారంలా కనిపించి "సిల్లీ"గా తోచినా "గుడ్ నైట్" చెప్పడం (ముద్దులెట్టుకోడం మినహా) మంచిదే! పిల్లలంతావచ్చి డాడీకి గుడ్‌నైట్ చెప్పి "కిస్" చేసి పోతూంటారు. అవన్నీ బానే ఉంటాయికాని "యిమిటేట్" చేస్తే అందులో "ఛాం" వుండదు. టెల్గూ సిన్మాలు అందుకే బావుండటం మానేసి చాలా కాలం అయింది. మన జాతిని నిద్రపుచ్చడానికి చవకబారు నిద్రమాత్రలు టెల్గూ సిన్మాస్ అండ్ ది టెల్గూ పత్రికల్సు... అబ్బ. నిద్దరొస్తూందండీ! గుడ్‌నైట్!

# ఎగిరే పళ్ళాలు

ఎగిరే పళ్ళేలున్నాయా లేవా అని తర్జన భర్జనలు జనులు పడుతున్నారు. లేవన్నవారు లేవన్నారు. ఉన్నాయన్నవారు ఉన్నాయంటున్నారు. అంతుతెలియని ఆబ్జెక్ట్సు ఆకాశంలో ఎగరడం చూశామన్నారు. దట్సాల్.

అంతుతెలియని ఆబ్జెక్ట్సు గృహమండలంలోనూ ఎగుర్తాయి. అవి పళ్ళేలే కానక్కరలేదు. గరిట్సూ, చమ్చాస్, గిన్నెల్సూ, చెంబులూ అన్నీ ఎగుర్తాయి ఎగిరే పెళ్లాలున్నచోట! ఎగిరే పళ్లేలూ ఎగిరే పెళ్ళాలు రెండూ నిజవే. ఆకాశమంతెత్తు ఎగిరే పెళ్ళాలున్న చోట ఎగిరే పళ్ళేలెందుకుండవు? పళ్లేనికి పెళ్ళానికీ వున్న గొళ్ళెం విడగొట్టడం సామాన్యం కాదు. పళ్ళెం నిండా రూపాయలు పుచ్చుకుని వచ్చేదేకదా పెళ్లాం - పళ్ళెంనిండా నోట్లకట్టల్ని చూశాక పెళ్ళాన్ని తెచ్చుకోవడమనే తంతు ఒహటుందికదా! దాన్నే ముద్దుగా మనవారు పెళ్ళి అన్నారు. పళ్ళెంలో కాళ్ళు కడిగాకే పిల్లనిస్తారుకదా.

పెళ్ళిలో కట్న కానుక్సు సరిగా జరపకపోతే పళ్లేలు ఎగుర్తాయి. ఎగిరే పెళ్ళాలున్నప్పుడు ఎగిరే మొగుళ్ళూ వుంటారు. ఈ ఎగరడవనే ప్రక్రియ ఉచ్చస్థితిని సూచిస్తుంది. ఉచ్చస్థితి అనగానేమి? ఉన్నచోటు నుండి ఎత్తుకి లంఘించడం, ఎంత ఎత్తుకి ఎగిరినా మళ్ళీ ఉన్న చోటుకి వచ్చి పడాల్సిందే. భూమ్యాకర్షణ శక్తినుంచి స్త్రీ ఆకర్షణనుంచీ ఎంత ఎత్తుకి ఎగరగలిగితే అంతక్రిందకు మళ్ళీ దిగివచ్చి పడాల్సిందే. ఎగిరే మొగుళ్ళు అప్పుడప్పుడు వచ్చి కాళ్ళమీద పడటం కద్దు. కలహాంతం ప్రణయం, కాఫ్యాంతం కౌగిలి అని అప్పటికప్పుడు సరిపెట్టుకోవాలి. కలహం కూడా సాధారణస్థితికి వ్యతిరేకమేకదా! వ్యతిరేకం కాకపోతే పోనీ భిన్నమైనదనుకోండి.

సాధారణమైనవన్నీ నేలబారు కార్యకలాపాలు. నేలవిడచి సాము చేయడం, గాలిలో ఎగరడం, ఆ గాలి కాస్త తగ్గాక చాపచుట్టలా కూలబడటం, మొగుళ్ళూ పెళ్ళాలూ వంతులవారీగా జీవితంలో అనుభవిస్తున్నట్టివే. అనుభవాలన్నీ అందంగా చెప్పుకోతగ్గవికావు కూడాను. ఎగిరే పెళ్ళాలు అందమైన అనుభవాలను ప్రసాదించకపోవచ్చు. ఎగిరే మొగుళ్ళూ అంతే -

ఎగరడవనే తాపత్రయం వెనుక, సంఘంలో వీపుగోకి అరికాళ్ళలోనూ అరిచేతులలోనూ దురదపుట్టించే పరిస్థితులుంటాయి. ఈ పరిస్థితుల ప్రభావ భావాంబరవీధిలో పళ్ళేలూ ఎగుర్తాయి. పెళ్ళాలూ ఎగుర్తారు (మొగుళ్ళ సంగతి సరేసరి).

ఎగిరేవయసని ఒకటుంటుంది. అప్పుడు ఎగరడం ఒకముచ్చట. ఎగరటం వేరు ఎగరేసుకుపోవడం వేరు. (పడుచుపిల్లల్ని కాదు). కొందర్ని డబ్బు ఎగరేస్తే కొందర్ని అధికారం ఎగరేస్తుంది. కొంతమంది కీర్తికోసం ఎగుర్తూంటారు. కీర్తి, అధికారం, డబ్బు కోసం ఎగిరేవాళ్ళ ఎగురుళ్ళు చూడలేక ఎగరలేనివాళ్ళు అవస్థలు పడుతూంటారు. (రచయితలు కొంతకాలం ఎగిరారు). ఇప్పుడు రచయిత్రులు ఎగుర్తున్నారు. కనుక రచయిత్రులు సాహిత్యాడంబర వీధిలో ఎగిరేపళ్ళేలు. (ఇందులో కొన్ని ప్రేమ పళ్లేలు - కొన్ని అపార్థపు పళ్లేలు - కొన్ని ఆదర్శపు పళ్ళేలూ. ఈ పళ్లేలు వార మాస పత్రికలచుట్టూ తద్వారా పాఠకుల మానసాకాశంలో జెట్ వేగంతో తిరుగుతూంటాయి).

ఈ ప్రేమ పళ్లేలతోనూ ఆదర్శపు పళ్లేలతోనూ అపార్థపుజిగురే కాకుండా, రంగుల నీతులూ, సంప్రదాయాల చద్దెన్నమూ, భారతీయసంస్కృతి పులిహోర, పాతివ్రత్యపు పాఠాలసారం రసం, కలహాల చిట్టి గారెలూ, ప్రేమ బూరెలూ, ఆధ్యాత్మిక లడ్డూలు వడ్డిస్తూంటారు వయ్యారంగా.

పళ్ళెం తర్వాత పళ్ళెం సీరియల్‌గా వస్తూంటుంది కనక పాఠక్స్ పత్రికల్ను జీర్ణం చేసుకోలేకపోయినా, అవి వారం వారం ఎగిరే పళ్ళేలు కనుక ఎగరేసుకుపోతూంటారు.

కమింగ్ టు ది పాయింట్. ఎగిరే పెళ్ళాలు ఎగిరెగిరి అప్పుడప్పుడు పుట్టింటి కెళ్ళి పడుతూంటారు. కొండొకచో వీరి ఎగురుళ్ళకు కారణమైన అహంకారధూళి. సంసారంనిండా వ్యాపించి నిజజీవితాలు మసకేసిపోవడం, ఆపేక్షలూ అభిమానాలూ కొట్టుకుపోవడం జరగొచ్చు. పెళ్ళాం ఎగుర్తోంది అనగానే తీసుకొనవలసిన జాగ్రత్తలు తీసుకోవాలి (సంసారాగ్ని మాపకదళంవారంటూ వుంటే వారిని పిలవాలి). బాహ్య పరిస్థితుల వలన మనసులో పుట్టిన కల్లోలమైతే ఆ పరిస్థితుల్ని సానుభూతితో టాకిల్ చేయాలి. జన్మతః ఆవిడ నిప్పులకుంపటి అయితే ఆ మంటలో నీళ్లుపోయాలి. ఇందుకు చీరలూ, రవికలూ, నగలూ, చేతినిండా డబ్బూ వాహనాలూ, సేవకులూ, వాసననూనెలూ చాలావరకు పనిచేస్తాయి. కాని కోరికలకు తీరడవంటూ వుండదుకదా! సినిమాలు సొసైటీకూడా మతమూ దేవతలుకూడా నిజం చెప్పక మన్ని మాయచేసి ఏడిపించుకు తింటున్న వాళ్లేకద. దేవుళ్ళు దొంగదేవుళ్ళు కాబట్టి “పతియే దైవము” అన్న ముక్కకు అర్థం ఏవిటి. నీ పతి దొంగదేవుడేసుమా అని. మొగుళ్ళు దొంగలైతే, పెళ్ళాలు పళ్ళేలు ఎగరేయక మానుతారా? మానరు. (పళ్ళేలను కడిగి తుడిచి శుభ్రం చేసేది పెళ్ళావేకదా. పళ్ళేలను ఎంగిలిచేయడం, పెళ్ళాలను ఎంగిలి చేయడం ఒహటికాదు).

ఎగిరే మొగుళ్ళకు ఎగరని పెళ్ళాలు లోకువ. ఎగరనిపెళ్ళాలకు వీపుమీద వాతలూ, మొహంనిండా మచ్చలూ, చంకలో త్యాగపు కన్నీళ్ళ బిందె, చేతిలో సంప్రదాయాల చీపురుకట్టా తప్పనిసరి. మంగళసూత్రం డేంజరులైట్లా ధగధగా దలమౌ పయ్యెదలో నడంగియు సముద్యత్కాంతు లీనంగ మెరుస్తోవుంటుంది. “కంటినీరే కడవ నింపితి గదరా” అంటూ వుంటుందా మోహనాంగి. అణకువ నెమ్మది, మెత్తగా మాటాడ్డం. దయగా చిరునవ్వు నవ్వడం, ఆర్ద్రనయనాలతో చూడ్డం. అపవిత్రమైన చూపులూ, ఆలోచనలు కలవారుకాని అశ్లీలంకాని దగ్గిరకు వస్తే భృకుటీకరించడం, భర్తయైనా సరే. పవిత్రమైన ఆలోచన్లు లేకుండా దగ్గరకు వస్తే... హితబోధ చేసి సన్మార్గానికి తిప్పడమో, సానికొంపకు తోలటమో చేయడం సాధారణ కథానాయకి (నవలల్లో) చేసే అసాధారణ కృత్యాలు.

ఎగిరే పళ్లేల నుంచి ఎగిరే పెళ్ళాలనుంచి తప్పుకుందుకు ఫస్టెయిడ్ బాక్సు ఓటుండాలి కొంపలో. ఫస్టెయిడుబాక్సులో ప్రేమ అనే టించర్ బెంజాయినుతోపాటు, పశ్చాత్తాపం అనే దూదికూడా హెచ్చుగా స్టాకు చేయాలి. తన తప్పుల్ని ఒప్పేసుకుని లెంపలు వాయించుకునే “అడకత్తెర” మార్కు మనస్తత్వాన్ని ప్రదర్శించగలనేర్పు చాలా అవసరం. నువ్వు దేవతవి నీకు నేను తగను నేను శుంఠని నువ్వు అపురూపతేజో విలాసినివి అంటూ పొగడి మాటల్తో బాండేజీ కట్టెయ్యాలి. నీకింకా కోపం తగ్గకపోతే నేను చేసిన పాపాలకి ప్రాయశ్చిత్తం యిదిగో యీ కత్తితో నువ్వు నన్ను పొడుస్తావా. నేనే పొడుచుకుని నీ కాళ్ళ దగ్గర పడి చచ్చిపోయేదా అని

(కత్తి ఆమె చేతికివ్వండి) చిన్న మోనోయాక్షన్ చేస్తే చాలు. ఎటువంటి కఠిన పాషాణహృదయిని ఐనా మూర్ఖవజ్రమేనా కరిగి నీరై ప్రవహిస్తుంది. ప్రవహించాలి - అది రూలు.

ఎగిరే పెళ్ళాం ఎప్పుడూ పాదదాసికాదు. ఆవిడ పాదరాణి అని గుర్తుంచుకుని జాగ్రత్తగా మెలగండి. సంసారంలోని గృహభేదాలకు ఫస్టెయిడ్ బాక్సు గురించి మరోమారు రాస్తా-బై! బై!

# సీతమ్మ వాకిట సిరిమల్లె చెట్టు

**క**థల్లో ట్రాజిడీలు, వున్నట్టు అత్తగార్లలో కొందరు కమీడియన్లుగానూ మరి కొందరు ట్రెజీడియన్లుగానూ లోకంలో నెట్టుకొస్తూంటారు బ్రతుకులు. మన సొసైటీలో అత్తగారూ - సవిత్తల్లి ట్రెడిషినల్ సింబల్స్- ఆర్నెల్ల పసిపాపకు కూడా ముందు వచ్చే మాట "అత్త" - కాని లోకం ఎవరూ అత్తగార్ల గురించి ఒక్క మంచి ముక్క చెప్పిన పాపానపోయినట్లు కనబడదు. అత్తగార్లను దుష్టశక్తులుగా చిత్రించటం సర్వేసర్వత్రా రివాజయిపోయింది (చూడుడు-సూర్యకాంతం పిక్చర్స్). మన సామెతలలోనూ నీతులలోనూ సూక్తులలోనూ అత్తగారిని గురించి మంచి ఎక్కడా లేదు. (కార్టూనిస్టులు సరేసరి). హైపవర్ కమీషన్స్‌లాగా అత్తగార్లు అథారిటీకి సంకేతాలు.

కత్తి మెత్తనా అత్త మంచీ లేదని త్రోసిపారేశారు.

అత్తగారు "గార్లు" బాగా పండుతారు. కారపుగారె, వుల్లిగారె, వుత్తగారె, మసాళా గారె, బెల్లపుగారె మరియు నేతిగారె, గార్లలో ఎన్ని వెరైటీ లున్నాయో - ఫియట్, అంబాసిడర్, హెరాల్డ్, చెవర్లెట్, బ్రూక్స్, వాక్స్‌హాల్, స్టాండర్డ్ దిబ్బా దిరుగుండం అంటూ కార్లలోనూ అన్ని రకాలున్నాయి.

కాంగ్రెస్‌లో అతివాదులూ, మితవాదులూ, కమ్యూనిస్టుల్లో ఉగ్రవాదులూ అత్యుగ్ర వాదులూ అని వున్నట్లు అత్తగార్లలో కూరగాయ వాదులూ వూరగాయవాదులూ అని రెండు రకాలున్నారు. ఉభయ వర్గాలూ కత్తిపీట ముందేసుకు కూర్చుంటారు. కనుక అహింసావాదులు వూరగాయ వాదుల ఉద్ఘోష వినిపించుకోరు. కొందరికి కూరలంటే ముఖ్యం. మరి కొందరికి జాడీలూ రాచిప్పలే ముఖ్యం. కోడళ్ళకు కులకడం ముఖ్యం. అత్తలు అరగదీయాలని చూస్తుంటారు. చితికి పోయిన భూస్వామ్య వ్యవస్థకు కొస మెరుపులాటి గురుతు అత్తగారైతే కోడలు సుత్తీ, కొడుకు కొడవలి. కార్మికులకూ, యజమానులకూ మధ్య సంఘర్షణ తప్పనట్లు కోడళ్ళకూ అత్తలకూ మధ్య వర్గ పోరాటం తాలూకు స్వభావం దిగక తప్పదు. అప్పర్‌హవుసూ లోయర్ హవుసూ రెండూ రద్దు చేస్తేనే కాని మగాడికి సంసారంలో సుఖశాంతులు మృగ్యం.